# దెయ్యం

పి.వి.సునీల్ కుమార్



దభేల్‌మని ఎగిరిపడ్డాడు రంగ. అప్పటికి సమయం మధ్య రాత్రి ఒక గంట దాటి పదో ఇరవయ్యోనిమిషాలవుతుంది.

ఊరి చివర ఉన్న ఇళ్ళేమో ఎక్కడా జనసంచారం కానీ వాహన సంచారం కానీ లేవు.

చీకటి చినుగుల దుప్పటిలా చిక్కగా ఉంది. దుప్పట్లో చిరుగుల్లా పైన నక్షత్రాలు, దయ్యం కళ్ళలా మినుకూ మినుకూ మంటున్నాయి.

చలిగాలి జివ్వుమని కొడుతూ ఉంది. ఆ కాలనీ కొంపలకి దగ్గర్లో ఉన్న మామిడి తోట కొమ్మల, రెమ్మల సందుల్లోంచి దూరి "ఇస్సు"మంటూ పిశాచం బుసకొట్టినట్టు వినపడుతూ ఉంది.

నేల మీంచి లేచి దుమ్ము దులుపుకున్నాడు రంగ. ఇక ఈ రాత్రికి శివరాత్రే అనుకున్నాడు.

అప్పటికి నెలరోజులపైనే అవుతుంది రంగకి అన్న వరస అయ్యే దూరపు బంధువు వీర్రాజు భార్య ఆ కొంపలో ఉరేసుకుని చనిపోయింది.

కడుపునొప్పి భరించలేక ఉరేసుకుందని కొందరు, వీర్రాజుగాడు పెట్టే బాధలు పడలేక పోయిందని కొందరూ, చింతలపూడి నూనెమిల్లులో ఆపరేటర్‌గా చేసే వీర్రాజుగాడే తాగేసి ఏమీ తోచక పెళ్ళాన్ని ఉరేసేడని కొందరూ, ఇలా సమైక్యాంధ్ర వేరు వేరు రాష్ట్రాలా అన్న సమస్యకి ఎన్నివాదనలున్నాయో, అన్ని రకాల వాదనలు వినిపించారు. కానీ ఆ విషయం త్వరగానే మరుగున పడింది... వీర్రాజు భార్య మంగ దయ్యంగా మారడంతో.

చనిపోయిన పది రోజుల తర్వాత తెల్లచీర కట్టుకుని, జుట్టు విరబోసుకుని పాత, కొత్త సినిమాల్లో డ్రస్ కోడ్ పాటిస్తూ, డ్యూటీ ఎక్కిన కొత్త కుర్ర పోలీసోడిలా తన దయ్యం యూనిఫాం మెయింటెన్ చేస్తూ, కాలనీ పక్క యెగ్గెన్నారాయణ మామిడి తోటలో డ్యూటీ మీద విరగ తిరుగుతూ ఉంది.

అక్కడున్న కాలనీలో అరవై కొంపలున్నా పూర్తయినవి సుమారు ముప్ఫైయే. గవర్నమెంటోళ్ళు ఇచ్చిన సొమ్ము పోనూ సొంత డబ్బు ఇరవై వేలుపైన వేసుకుని పూర్తి చేసి కాపురం పెట్టగలిగినోళ్ళే అక్కడున్నారు.

అందలో ఓ అన్నాబత్తుల సూర్రావు రాత్రేళ

మూత్రం పోసుకుందుకు తన ఇంటికి, తోటకి మధ్య ఉన్న కంప దగ్గరికి పోయే సరికి, మసక మసక వెన్నెల్లో మబ్బులా నడుచుకుంటూ పోతూ ఉంది మంగ. మంగ నీడ పడి తలెత్తి చూసిన సూర్రావు వేపు తిరిగి రామ్‌సే బ్రదర్స్ సినిమా దయ్యం డిటిఎస్‌లో నవ్వినట్టు పలకరింపుగా నవ్వింది.

ఆ దెబ్బకి లుంగీ తడిపేసుకున్న అన్నాబత్తుల సూర్రావు ఎలా తన కొంపలోకి చేరాడో, ఎలా ఆంజనేయస్వామి పటాన్ని పట్టుకుని విరుచుకుపడిపోయాడో జనం వింతగా చెప్పుకున్నారు.

మర్నాడు రాత్రి కొంత మంది ఇళ్ళ తలుపులు దబదబా కొట్టింది మంగ దయ్యం.

దాహంతో మూలుగుతున్నట్టూ, నీళ్ళు ఇవ్వమని అడుగుతున్నట్టూ ఉందని కొందరన్నారు.

మూలిగింది దాహంతో కాదని, మెడకున్న ఉరితాడు తియ్యమని అడిగిందని కొందరన్నారు. జనం ఏదో ఒకదాన్ని అంత తొందరగా ఒప్పుకోరు కదా. పిల్లలు సందేలైతే చాలు గుమ్మాలుదాటి రావట్లేదు.

అందరూ ఇళ్ళమీద ''ఓ స్త్రీ రేపు రా'' అని రాసి కుంకం నీళ్ళతో చేతిగుర్తు చరిచారు.

మంగ దయ్యం రెండో క్లాసే చదివినా తెలుగు బాగానే వచ్చినట్టుంది. రేపు రా అనగానే అర్థం చేసుకుని మర్యాదగా వాళ్ళ తలుపు కొట్టడం మానేసింది.

ఈ బాధ పడలేక వీర్రాజుగాడు నూనెమిల్లు షావుకారు గారిదే సత్తుపల్లిలో ఉన్న ఐస్ ఫ్యాక్టరీ ఉద్యోగానికి ఆరేళ్ళ కూతురుతోపాటు మకాం మార్చాడు.

ఐతే అంతడబ్బోసికొనుకున్న కొంపని వదల్లేక తన బంధువుల్లో ధైర్యస్థుడని పేరుండీ, ఖాళీగా తిరుగుతున్న రంగడిని రోజుకి క్వార్టర్ రాయల్ స్టాగ్ ఇచ్చే ఒప్పందం మీద కాపలా పెట్టాడు.


రంగడు రాయల్ స్టాగ్ సవారీ మీదుంటే ఒసామా బిన్ లాడెన్ కైనా భయపడడు. కానీ ఇది దెయ్యం.

ఆ రాత్రి మంచం మీంచి పడేసిన దయ్యంతోపుకి వెళ్ళి శివాలయం మెట్ల దగ్గర పడకేసిన రంగడు పొద్దుటే కొంపకి వెళ్ళాడు.

ఇంత అన్నం ఒండు:కుని,పప్పు పొయ్యి కెక్కించి, అసుంటా ఉన్న చింత చిగురు తెచ్చుకుని కూరలో ఏసి, అన్నం గిన్నె మూత తీసి బిగిసి పోయాడు.

అన్నం కుండ నిండా ..........ఎర్రగా........... రక్తం...............

ఆ దెబ్బతో బతికుంటే రాయల్‌స్టాగ్ సీసాలేరుకునైనా బతకొచ్చనే జ్ఞానోదయం కావడంతో వెనక్కి తిరిగి చూడకుండా కొత్త బస్టాండు కెళ్ళి గురుభట్ల గూడెం బస్సెక్కేశాడు.



వీర్రాజు పట్టువదలని విక్రమార్కుడులా బ్రాందీషాపుల వెమ్మట తిరగ్గా, తిరగ్గా ఓల్డ్ మాంక్ మంగారావు దొరికాడు. మంగారావు కూడా ఓల్డ్ మాంకు నిబ్బు పుచ్చుకున్నాడంటే పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఎదురుగా ఉన్నాసరే నిబ్బరంగా ఉండగలడు. 'ఏరా ఇలా వచ్చేవ్' అని తెలుగులో పలకరించగలడు.

ఇంట్లో పడుకుంటే నిబ్బు ఉచిత స్కీము పనిచేసింది. రెండు రోజులు మంగ దయ్యం కనబడలేదు. ఆ ఇంటికి దెయ్యం కొంప అనే బ్రాండు పోతే బ్రాందీ షాపు ఎదురుగా వంద కొబ్బరికాయలు కొట్టి మంచి రేటుకు అమ్ముకోవచ్చన్న ఆశ వీర్రాజులో నిబ్బంలై, హోఫంలై, పుల్లంలైంది.

ఓల్డ్ మాంక్ మంగారావు కూడా 'దయ్యాల్లేవు, గియ్యాల్లేవు... మన దెబ్బకి మంగ దెయ్యం ఎక్కడికో లగెత్తేసింది...'' అని తీర్మానించాడు.

కానీ మంగ దయ్యం వి.ఆర్.ఎస్. తీసుకునే బాపతు కాదనీ, కేవలం రెండు రోజుల కాజువల్ లీవు మీద వెళ్ళిందని ఆ రాత్రే అర్థమైంది.

ఆ రాత్రంతా వీర్రాజుగాడి కొంపచుట్టూ ఐటెం సాంగ్‌లో ముమైత్ ఖాన్‌లా రెచ్చిపోయి డాన్సింగా డేసింది. మంగారావులోని ఓల్డ్ మాంక్ ఆవిరైపోగానే భయంతో బిక్క చచ్చిపోయాడు. ఇంట్లోంచి జంపైపోయి గుడిమెట్ల మీద పడుకున్నాడు.

అంత భయపడక్కర్లేదనీ, ముఖం కనపడకుండా ముసుగేసున్న వాళ్ళని దెయ్యాలు ఏమీ చెయ్యవని, బ్రాందీ షాపు బైట ఎగ్ బజ్జీలు అమ్మే వెంకటాద్రి ఇచ్చిన సలహాని సీలు బాటిల్‌లో సరుకుని నమ్మినట్టు నమ్మేసి ఆ రాత్రి కూడా వీర్రాజింట్లోనే పడుకునే సాహసం చేశాడు ఓల్డ్ మాంక్ మంగారావు.

ఐటమ్ సాంగ్ స్టార్టవగానే ''శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం'' అనుకుంటూ దుప్పటి ముసుగుపెట్టుకున్నాడు.

తలుపు తెరుచుకుంటున్న శబ్దం వినబడుతోంది. మంగారావుకి. మంగ దెయ్యం వేసుకున్న కాలిపట్టాల శబ్దం, చేతులకి వేసుకున్న గాజుల శబ్దం

కూడా వినపడ్డాయి.

అకస్మాత్తుగా మంగ దెయ్యం బడితె తీసుకుని మంగారావుని విరగతియ్యడం మొదలు పెట్టింది. ఆ బడితెపూజ అవుతున్నంత సేపూ గాజుల శబ్దం మరింత స్పష్టంగా వినపడింది మంగారావుకి. మంగదెయ్యం భీకరంగా ఊపిరి ఎగాదిగా పీలుస్తోంది.

దీంతో ఓల్డ్ మాంక్ మంగారావుకి మూడు విషయాలు అర్థమయ్యాయి. ఒకటి ఆడ దెయ్యాలకి చచ్చినాక కూడా గాజులు, కాలి పట్టాలు వంటి షోకుల మీద కోరిక చావదనీ ; రెండు దెయ్యాలకి హింస అంటే ఇష్టమనీ, మూడోది అదృష్టవశాత్తు దెయ్యాలు కూడా అలసిపోతాయని.

మాట్లాడితే, ముసుగుతీస్తే ఎక్కడ మీదెక్కి పీక కొరికేస్తుందో అని భయపడ్డ ఓల్డ్ మాంక్ మంగారావు, ఓపిగ్గా, శ్రద్ధగా తన్నులు తిని మర్నాడు ఉదయమే యంగ్ మాంక్‌వేగంతో ఆ ఇంట్లోంచి, చింతలపూడి ఊళ్ళోంచి మాయమైపోయాడు.

అప్పుడా ఇంట్లోకి చేరేడు నక్కా సత్యానందం! సత్యానందానికి పెద్దగా నమ్మకాలు లేవు దెయ్యాల మీద, కానీ అదంతా ఆ ఇంట్లో చేరే వరకే.

చేరిన రాత్రే ఇంట్లో పడుకున్న సత్యానందాన్ని ఎత్తుకెళ్ళి తోటలో పడేసింది మంగదెయ్యం. పొద్దుట చెంబట్టుకుని ఆ దారంటా పోతున్న ఆడాళ్ళు నీళ్ళు జల్లి లేపితే లేచి ఇంటికి పోయాడు.

''నేను ఇక్కడికి ఎప్పుడొచ్చాను' అని ఆశ్చర్యపోయాడు కూడా.

ఆ రాత్రే మంగదెయ్యం మళ్ళీ ''ఇంట్లోంచి పోరా'' అంటూ అరిచి బొబ్బలు పెట్టడం ఆ కాలనీలో వారంతా విన్నారు. ఐతే గుండె నిబ్బరం ఉన్న సత్యానందం దానిమీద తిరగబడి ''ఎయ్యి రూపాయలు పోసి కొన్నానే ముండకానా'' అని తిరగబడితే, 'రక్తం కక్కుకుని చస్తావురా...' అని వికటంగా నవ్వేసి పోయింది మంగదెయ్యం.

ఇక ఆ కొంపకీ, తనకీ రుణం తీరిపోయిందని నిర్ధారించుకున్న వీర్రాజు రెండు వేల రూపాయలకు ఆ ఇంటిని నక్కా సత్యానందం పేర కాయితం రాసేసి శాశ్వతంగా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత క్రమంగా మంగ కనిపించడం మానుకుంది.

మంగ చనిపోయిన తర్వాత తాను తోటలో కట్టుకుని తిరిగిన చీరని ఎవరూ చూడకుండా తగలెట్టేడు సత్యానందం.

రాయల్ స్టాగ్ రంగడిని మంచం మీంచి తోసేసి, వాడి కూడులో ఎర్ర సిరా పోసేసి, జనం కొంపల తలుపులు కొట్టి ఓల్డ్ మాంక్ మంగారావుని విరగదీసి అరవై వేలు చేసే ఇంటిని రెండు వేలకే కొట్టేసిన సత్యానందం ''ఉంటాది....నమ్మితే దెయ్యం వల్ల కూడా ఉపయోగం'' అనుకున్నాడు సంతోషంగా.

ఉపసంహారం

దేవుడి వల్ల భక్తుడికి లాభం ఉండొచ్చు, లేకపోవచ్చు. అది వారి నమ్మకాన్ని బట్టి ఉంటుంది.

కానీ పూజారికి మాత్రం అది సత్యం, నిత్యం, ఖాయం. ఎల్లవేళలా దేవుడు అతణ్ణి లాభపెడుతూనే ఉంటాడు.

నమ్ముకుంటే, వాడుకుంటే నమ్మకం ఏ రూపంలోనైనా లాభమే. దాని పేరు కావచ్చు దేవుడు......లేదా ......దెయ్యం.

రచయిత సెల్ నెం: 9440902660

# ఆశీర్వదిస్తూ అక్షింతలు వేస్తారెందుకు?

## సందేహాలు - సమాధానాలు

**యం అశోక్, కెసి క్యాంప్**

*నిష్కామకర్మ అంటే ఏమిటి... వివరంగా తెల్పండి.*

నీవు చేయవలసిన పనిని నీవు చిత్తశుద్ధితో చేయి. పని తాలూకు ఫలితాన్ని నాకు వదిలిపెట్టు అంటూ శ్రీకృష్ణుడు నిష్కామకర్మ ఎలా చేయాలో అర్జునునికి బోధించాడు. చేస్తున్న పని తాలూకు ఫలితం ఎంత ఉంటుంది అని ఊహించడానికి మనిషికి తాహతు చాలదు. ఎందుకంటే ఇచ్చేవాడు పరమేశ్వరుడు.... ఏదైనా ఇస్తాడు. కావలసింది కోరుకోవడం మనిషికి చేతకాదు. 'యద్యత్కర్మ కరోతి తత్తదఖిలం శంభో తవారాధనం' అన్నాడు ఆదిశంకరుడు. చేసే ప్రతిపని దైవానికి సమర్పిస్తూ చేయడమే నిష్కామకర్మ. ఫలితాన్ని ఆశించి మొదలుపెట్టే ఏ పనీ సంపూర్ణత్వాన్ని సాధించలేదు. అందుకే దేవునిపై భారం వేసి ఏ పని అయినా తలపెట్టమని తేటతెలుగులో మనపెద్దలు చెప్పారు.

**యం. కృష్ణమూర్తి, సూర్యాపేట**

*రామకృష్ణ పరమహంస, రమణమహర్షి సామాన్యులను, ఉన్నత వర్గాల వారిని సమానంగా అనుగ్రహించారా? మళ్లీ అలాంటి వారు పుడతారా?*

జనన మరణ చక్రాన్ని భేదించి, శాసించే స్థాయికి వారు ఎదిగారు కాబట్టే కాలప్రవాహాన్ని తట్టుకుని నిలబడ్డారు. మళ్లీ జన్మించాల్సిన అవసరం వారికి లేదు. ఒకవేళ ఉన్నా అదే పేరుతో జన్మించాలని ఏమున్నది? ఏ గురువూ తనంతట తానుగా బయటపడడు. మనమే గుర్తించాలి.

**కె.పుష్పవల్లి, విశాఖపట్నం**

*వేప, రావిచెట్టును కలిపి పూజించడంలో విశేషం ఏమిటి?*

రావిచెట్టును పురుషుడిగా (విష్ణువు), వేపచెట్టును స్త్రీ స్వరూపంగా (లక్ష్మి) భావించి వాటికి పెళ్లి చేసి పూజిస్తారు. ఈ జంట వృక్షాలను అర్చిస్తే దాంపత్యం అన్యోన్యంగా సాగుతుందని విశ్వాసం. రావిచెట్టుకు నమస్కరించి, ఆలింగనం చేసుకుంటే శనిదోషం నివారణమవుతుందని చెబుతారు. దీనినే బోధివృక్షమని కూడా అంటారు. సిద్ధార్థుడికి దీనికిందే జ్ఞానోదయమై 'బుద్ధుడు' అయ్యాడు. అందువల్ల రావి (బోధి) వృక్షాన్ని బౌద్ధులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఇక వేపచెట్టులో ఎన్నో ఔషధ గుణాలు న్నాయి. దీని ఆకులను అనేక వ్యాధుల నివారణకు మందుగా వాడతారు. ఈ ఆకులతో నీరు కాచి స్నానం చేస్తే చర్మ వ్యాధులు నశిస్తాయి.

**ఎ.ఎస్.రామానుజస్వామి, హైదరాబాద్**

*ఆలయాల్లో హారతి సమయంలో గంట ఎందుకు?*

దేవాలయాల్లో సుప్రభాతం,బాలభోగ నైవేద్యం నుంచి నుంచి మహానైవేద్యం, పవళింపు సేవ వరకు జేగంటలు మోగిస్తారు. హారతి సమయంలో కొట్టే గంటకు, 'హారతిని అందుకునే దేవుడు మహాదైవాంశతో అక్కడి విగ్రహంలోకి ప్రవేశించాలని, ఈ అపూర్వ సమయానికి దేవతలంతా హాజరు కావాలనే ఆహ్వాన చిహ్నంగా' అర్థం చెబుతారు. భగవంతుడు విగ్రహ ప్రవేశం చేస్తారని, దేవతలంతా అక్కడ కొలువు తీరతారన్న విశ్వాసం నేపథ్యంలో హారతి ఇచ్చేవేళ దైవాన్ని ప్రత్యక్షంగా వీక్షించినట్లే భావిస్తారు.

**కె.కనకదుర్గ, అనకాపల్లి**

*ఆశీర్వచనంలో అక్షింతలు వేయడం ఎందుకు?*

విధాత, బ్రహ్మదేవుడు జీవుల భవిష్యత్‌ను వారి నుదుటిపై రాస్తాడు. కర్మఫలాలన్నీ తలపై రాసి ఉంటాయట. పెద్దలు, ధర్మజ్ఞులు అలా అక్షితలు వేసి ఆశీర్వదించడం వల్ల తలరాతలోని దోషం కొంతయినా తగ్గుతుందని నమ్మకం. అయితే అలా వేయగా నేలరాలిన అక్షితలను ఏరి ఎవరూ తొక్కని ప్రదేశంలో వేయాలి.

మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి

**సందేహాలు-సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500033**